TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 80 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.15.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# కాంగ్రెస్ పాలనలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

జూబ్లీహిల్స్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఉప ఎన్నిక సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగల్‌రావు నగర్, యూసుఫ్‌గూడ కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశం మంగళవారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రతి ఓటర్‌కూ చేరవేయా లన్నారు. కలిసికట్టుగా కష్టపడితే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గూబ గుయ్యిమనేట్టు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంత వుతుంద న్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ గులాబీ పార్టీ ఓట్ల కోసం ఆరాటపడుతున్నదని విమ ర్శించారు. సునీతపై తమకు సానుభూతి ఉంది కానీ కేటీఆర్, హరీశ్ వారి రాజకీయాల కోసం ఆమెను ఇబ్బంది పెడుతున్నారని విమర్శిం చారు. దొంగ ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ ఓట్ల నమోదుకు బీఆర్ఎస్, బీజేపీదే బాధ్యత అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉ న్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, సీతక్క, ఎంపీ, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్‌లు విజయారెడ్డి, సీఎన్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ చైర్మెన్ శివసేన, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, సీనియర్ నాయకులు అజారుద్దీన్, మురళిగౌడ్, సంజరు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత నర్సింగ్ విద్యార్థులను ఆదుకోండి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: నైటింగేల్ నర్సింగ్ స్కూల్ చేత మోసపోయిన బాధిత జీఎన్‌ఎం విద్యార్థులను ఆదుకోవాలని సామాజిక కార్యకర్త అడ్వొకేట్ డాక్టర్ లుబ్నా సార్వత్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధిత విద్యార్థినీలతో పాటు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. నైటింగేల్ బారి నుంచి వారిని తప్పించి ఆరు ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లలో వారు చదువుకుంటున్నట్టు ఆమె తెలిపారు. అయితే ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులను ఆ విద్యార్థులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి కుటుంబాల్లో మొదటి జనరేషన్ గ్రాడ్యుయేట్స్‌గా మారే క్రమంలో వారికి కావాల్సిన సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చినట్టు లుబ్నా సార్వత్ వెల్లడించారు.

# తరగతులకు అనుమతించండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎమ్మార్వో కుల ధ్రువీకరణ పత్రాన్ని కింది స్థాయి అధికారులు తనిఖీ చేయలేదని చెప్పి ఒక ఎస్టీ అభ్యర్థిని యుపీఎస్సీ కోచింగ్ తరగతులకు అనుమతించకపోవడంపై హైకోర్టు స్పందించింది. క్షేత్ర స్థాయి తనిఖీలు జరిగేలోగా పిటిషనర్‌ను తరగతులకు అనుమతించాలని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీని ఆదేశించింది. నిజామాబాద్ జిల్లా నల్లూరు గ్రామస్తుడు కార్తీక్ కుమార్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ వేణుగోపాల్ ఆదేశాలిచ్చారు. ఎస్టీ సంక్షేమశాఖ వాదనల నిమిత్తం విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.

పీటీఏలపై వివరాలు ఇవ్వండి

తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల్లో పేరంట్, టీచర్ అసోసియేషన్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారించింది. రాష్ట్ర విద్యా చట్టం ప్రకారం ప్రతి పాఠశాల స్థాయిలో పీటీఏ ఏర్పాటుకు ఆదేశాలివ్వాలంటూ సంగారెడ్డి జిల్లా కంది గ్రామానికి చెందిన మల్లికార్జున్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించేందుకు, పాఠశాల నిర్వహణ, కనీస సౌకర్యాల కల్పన, పర్యవేక్షణకు కమిటీ దోహదపడుతుందని పటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ కౌంటర్ నిమిత్తం విచారణ 6 వారాలకు వాయిదా పడింది.

వినతిపత్రంపై చర్యలు తీసుకోండి

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌పై అందిన వినతిపత్రంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

పబ్లిక్ స్కూల్‌ను 1994 విద్యాసంస్థల చట్ట నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారో లేదో చెప్పాలంది. పబ్లిక్ స్కూల్‌లో అవతవకలపై విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఏప్రిల్ 15న వినతి పత్రం ఇచ్చినప్పటికీ చర్యలు లేవంటూ హైదరాబాద్ వాసి రవీందర్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్ వినతిపత్రంపై విచారణ జరిపి మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను మూసివేసింది.

# చిక్కడపల్లి లైబ్రరీ వద్ద ఉద్రిక్తత




ముషీరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ చిక్కడపల్లిలోని సిటీ సెంట్రర్ లైబ్రరీ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు, నిరుద్యోగ సమస్యపై చర్చించేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత మంగళవారం సిటీ సెంట్రర్ లైబ్రరీ వద్దకు వచ్చారు. ముందే విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె లైబ్రరీలోనికి ప్రవేశించకుండా గేటుకు తాళం వేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కవిత వెంట వచ్చిన జాగృతి నాయకులు గేటు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. అనంతరం అక్కడ విద్యార్థులతో కలిసి కవిత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు విద్యార్థులకు అన్యాయం చేశాయి కాబట్టే ప్రతిపక్షంలో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. విద్యార్థులతో ప్రశాంతంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడానికి వస్తే పోలీసులు ఉద్రిక్త పరిస్థితి సృష్టించారని అన్నారు. లైబ్రరీ గేటులోనికి రానివ్వకుండా అడ్డుకున్నారని, లోనికి ప్రవేశించినా లైబ్రరీలోకి వెళ్లకుండా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1 అవకతవకలపై కోర్టులో విచారణ జరగనుందని, సింగిల్ జడ్జిమెంట్ ఏదైనా, అందుకు కట్టుబడి ఉండాలని కవిత కోరారు. తెలుగు భాషలో పరీక్ష రాసిన విద్యార్థులు అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. నష్టపోయిన వారిలో పోలీసుల పిల్లలు కూడా చాలామంది ఉన్నారని, తమరు ప్రభుత్వానికి వత్తాసు పలకడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం లేదని, అటువంటి ప్రభుత్వాన్ని ఏ విధంగా రక్షిస్తారని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలకు పాత నోటిఫికేషన్ ఇచ్చిందని, కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని తెలిపారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డివిజన్ బెంచ్‌లో విద్యార్థులకనుగుణంగా తీర్పు రాకపోతే సుప్రీంకోర్టు వరకు విద్యార్థుల వెంటే ఉండి నడుస్తామన్నారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా గ్రూప్-1ను రద్దు చేయాలని కోరారు.

# కుప్పకూలే దిశగా ఆర్థికవ్యవస్థ



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే దిశగా పయనిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలు నెగెటివ్ ద్రవ్యోల్బణం పాలనా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. అనాలోచిత విధానాలతో ఆర్థిక నిర్వహణలో రేవంత్ సర్కారు విఫలమైందని విమర్శించారు. రాష్ట్రం తిరోగమనం వైపు పయనిస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 శాతంగా నమోదైతే, తెలంగాణలో నెగెటివ్ ద్రవ్యోల్బణం నమోదవుతుండటం మందగించిన ఆర్థిక పతనానికి సంకేతమని చెప్పారు.

జూన్‌లో -0.93 శాతం, జులైలో 0.44 శాతం, సెప్టెంబర్‌లో 0.15 శాతంతో వరుసగా నాలుగు నెలల్లో మూడు నెలలు డిఫ్లేషన్ నమోదు కావడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రుణాత్మక ద్రవ్యోల్బణం మూడు సార్లు నమోదు కావడం ఇదే మొదటి సారి అని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సాధారణంగా వినియోగం పెరిగి, పాజిటివ్ ద్రవ్యోల్బణం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందనీ, కానీ, నెగిటివ్ ద్రవ్యోల్బణం నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక విధానాల వైఫల్యమని తెలిపారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలన, ఆర్థిక అరాచకత్వం వల్ల రాష్ట్రం ఆర్థిక తిరోగమనం వైపు పయనిస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుల్డోజర్ విధానాలు, ప్రతీకార రాజకీయాలు మానుకొని చతికిల పడిపోతున్న రాష్ట్ర ఆర్థిక వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

# దేవాదుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: జే.చొక్కారావు-దేవాదుల ప్రాజెక్ పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తద్వారా ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడమే తమ ముందున్న కర్తవ్యమని వ్యాఖ్యానించారు. జే. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పురోగతిపై మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖామంత్రి దపసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, యశశ్విని రెడ్డి, సత్యనారాయణ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారుడు ఆదిత్య నాథ్ దాస్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, ఈఎన్సీలు అంజద్ హుస్సేన్, రమేష్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిర్ణీత కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.పాలనాపరమైన అడ్డంకులను సత్వరం తొలగించి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా గంగారాం గ్రామ సమీపంలోని గోదావరి నది నుండి 38.16 టీఎంసీల నీటిని వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భుపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి భువనగిరి. సూర్యాపేట, సిద్దిపేట జిల్లాలలో 5.57 లక్షల ఏకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని ఆయన వివరించారు. 71 మీటర్ల ఎత్తు నుంచి 540 మీటర్ల ఎత్తు వరకు, మొత్తం 469 మీటర్ల మేర ఎత్తిపోతల పథకమన్నారు. పంప్ హౌస్ లు, కాలువల తవ్వకాలు, నీటి సరఫరా తదితర పనులు పూర్తి చేసేందుకు గాను మూడు దశల్లో పనులు జరుగుతున్నాయన్నారు. 5.56 లక్షల ఎకరాలను సాగులోకి తేవడానికి ఉద్దేశించబడిన ఈ ప్రాజెక్టు కింద ఇప్పటి వరకు 3.17 లక్షల ఏకరాలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. భూగర్భజలాలతో సాగులో ఉన్న 58,028 ఎకరాల విస్తీర్ణంతో కలుపుకుంటే మొత్తం ఆయకట్టు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

సవరించిన అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.18,500 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.14,269,63 కోట్లు ఖర్చు పెట్టినట్టు ఆయన వెల్లడించారు. మిగిలిన పనుల పూర్తికి రూ.4,230 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో నిర్మాణానికి గాను రూ. 11,667.85 కోట్లు ఖర్చు చేయగా భూసేకరణ నిమిత్తం 1,343.06 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. అంతే గాకుండా హైడ్రో-మెకానికల్-విద్యుత్ అవసరాల నిమిత్తం రూ. 1,170.63 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. 2,430 కిలోమీటర్ల కాలువ తవ్వల్సి ఉండగా 1,663.10 కిలోమీటర్ల తవ్వకాలు పూర్తి అయ్యాయని చెపాపరు. అలాగే 702.62 కిలోమీటర్ల పైపులైన్‌కు గాను ఇప్పటికి 669.66 కిలోమీటర్ల మేర పూర్తి చేశారని వివరించారు. కాలువల లైనింగ్ కుడా 799.80 కిలో మీటర్లు పూర్తి అయ్యిందని ఆయన చెప్పారు. 46 ట్యాంక్‌లకు గాను 39 పూర్తి కాగా, 21 పంప్‌హౌజ్‌లలో 18 ట్యాంకులు పురోగతిలో ఉన్నాయన్నారు. అధికారికంగా అందించిన గణాంకాల ఆధారంగా వివిధ విభాగాలలో 67 శాతం నుంచి 95 శాతం మేర పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టు మొదటి దశలో సాలీన 170 రోజుల పాటు 5.18 టీఎంసీ నీటిని పంపిణీ చేయగా 1.23 లక్షల ఎకరాలకు సాగునీరు సమద్ధిగా అందుతుందన్నారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో

## ఉద్యోగులందరూ పాల్గొనాలి : జిల్లా పాలనాధికారి రాజర్షి షా

*తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వేలోపాలుపంచుకోండి :
https://www.telangana.gov.in/telanganarising/

TELANGANA RISING 2047
Take Citizen Survey Now



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి తెలంగాణా రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ -2047 డాక్యుమెంటు ను రూపొందిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టారు. అక్టోబర్ 10 వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐ లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కాగా, ఈ తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వే లో రాష్ట్రంలోని ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తూ నేడు సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఈనెల 25 వ తేదీ వరకు జరిగే విజన్-2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడం తోపాటు ఈ సర్వే లింక్ ను,QR కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆ సర్క్యులర్ లో ఆదేశించారు. ఈ సర్వేలో పాల్గొనేందుకు గానుhttp //www.telangana.gov.in/telanganarising/ అనే లింక్ ద్వారా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఎస్సీ, ఎస్టీల పై దాడులను పర్యవేక్షించే విజి లెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఎస్సీ, ఎస్టీల పై దాడులను పర్యవేక్షించే విజి లెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, శాసన సభ్యులు పాయల్ శంకర్ లతో కలిసి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ లు శ్యామలాదేవి, రాజేశ్వర్, అదనపు ఎస్పీ కాజల్ సింగ్, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, ట్రైనీ డిప్యూటి కలెక్టర్ వంశీ కృష్ణ రెడ్డి, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, డీఎస్పీ జీవన్ రెడ్డి, సంబంధిత అధికారులు, కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి సంబంధించిన నిధుల వినియోగం, అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు, అనుసరించాల్సిన పారదర్శకత పై సమీక్ష జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాలని కమిటి సభ్యులకు సూచించారు.

కమిటీ సభ్యులు వారి సూచనలు, అభిప్రాయాలను వ్యక్తపరిచారు.


SCs/STs పై అన్యాయాల నివారణకు తీసుకొచ్చిన చట్టాలు ం Protection of Civil Rights Act, 1955 (PCR Act) మరియు Scheduled Castes and the Scheduled Tribes (Prevention of Atrocities) Act, 1989 (PoA Act) అమలులో పారదర్శకత, పర్యవేక్షణ, సమర్థత కోసం జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడుల పై చర్యలను నివారించేందుకు, బాధితులకు న్యాయం జరిగేందుకు కమిటీ కీలకంగా పనిచేస్తుందని చట్టాల అమలును పర్యవేక్షిస్తూ బాధితులకు సకాలంలో పరిహారం, న్యాయం అందేలా చూస్తుందని, సభ్యులు తమ బాధ్యతల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పై చర్చించారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పరిహారంగా బాధితులకు రూ. 25 వేలు, అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులకు ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు అయిన వెంటనే రూ. 25వేల పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక - ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక - ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖల అధికారులతో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల విద్యార్థుల సంక్షేమం పై నిర్వహించిన సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని, సమస్యల పరిష్కారంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు స్కూల్ లలో 425 మంది విద్యార్థులు చదువుతున్నారని, దసరా సెలవుల తరవాత వారిని స్కూల్స్ లోకి రానివ్వడం లేదన్నారు.జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమం పై సంబంధిత శాఖల అధికారులు ఆయా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రేపు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయడం జరుగుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ, తదితరులు పాల్గొన్నారు.

# వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ అధికారి రాజ్ కుమార్ మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో వరి పొలాలను పరిశీలించారు. ఆలస్యంగా నాట్లు వేసుకున్న పొలాలలో ఎండు తెగులును గమనించి, నివారణకు ప్లాంటోమైసిన్ ప్లస్ కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును ఎకరానికి 500 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పలుపోసుకునే దశలో కంకి నల్లి, కాటుక తెగులు నివారణకు స్పైరోమెసిఫ్ 200 ml ం ప్రొపైకానాజోలు 100 ml ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు ధీటుగా విద్యా బోధన : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేటు బడులకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు యూనిఫార్ములు, నోటుబుక్లు, పాఠ్యపుస్తకాలు అందుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్పై సమీక్ష చేశారు. సామాన్య శాస్త్ర పాఠానికి సంబంధించిన పటాలను బోర్డు పై గీయించి, విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు. బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలపై భయపడకుండా స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపని, క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను సాధించవచ్చు అని కలెక్టర్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.



పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పక్కన జిల్లా విద్య అధికారి భోజన్న

విద్యార్థుల హాజరు శాతం, సిలబస్ పురోగతి, బోధన నాణ్యతపై వివరాలు కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తి హాజరు నమోదు కావాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలతో వారిని మెరుగుపరచాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా చూడాలని అన్నారు. సిలబస్ను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు, పునరావృత పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థిని ప్లక్ష్య స్వయంగా వేసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందించగా, ఆమె ప్రతిభను కలెక్టర్ అభినందించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ పుష్పలత, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పత్తి పంట కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి పత్తి పంట కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటల కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పత్తి కొనుగోలు ప్రక్రియను నిర్ణీత సమయానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోళ్లకు సంబంధించి ఆన్లైన్ స్లాట్ బుకింగ్ కోసం 'కపాస్ కిసాన్ యాప్' వినియోగించాలని తెలిపారు. రైతులకు ఈ యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. రైతు వేదికల ద్వారా, గ్రామాల్లో ఎవోలు, ఎఈవోలు రైతులకు ఈ యాప్ వినియోగ విధానాన్ని వివరించాలన్నారు. రైతులు పత్తి కొనుగోలు సంబంధిత సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800-599-5779 లేదా వాట్సప్ నంబర్ 8897281111 ను సంప్రదించి సమాచారం పొందవచ్చని వివరించారు. రైతుల పంటకు ఖచ్చితంగా మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తేమ శాతం విషయంలో రైతులు నష్టపోకుండా వారికి పూర్తి వివరాలు ముందుగానే తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లులలో అవసరమైన అన్ని వసతులు ఉండేలా చూడాలని, ముఖ్యంగా అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వే బ్రిడ్జీలకు నిర్ణీత గడువులోపే స్టాంపింగ్ చేయించుకోవాలని సూచించారు. రైతులు పంటలు అమ్మిన వెంటనే వారికి నిర్ణీత గడువులోపు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోళ్లలో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు తమ పంటను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించవద్దని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు సంబంధించిన 'కపాస్ కిసాన్' యాప్ గోడప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మార్కెటింగ్ అధికారి గజానంద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, మార్క్ఫెడ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్ రెడ్డి, అబ్దుల్ హాదీ, రైతులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల విద్యా బోధనలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లుబట్టి విక్రమార్క ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పరిస్థితులపై మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్లో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా బోధనలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా చూడాలని, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలతో సమన్వయం కలిగి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఉత్తమ మౌలిక వసతులతో విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించనున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఈవో భోజన్న, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న తెలంగాణ రాష్ట్ర బంద్..

సూర్యాపేట :అమృత్ తెలంగాణ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తలపెట్టిన బందు పోస్టర్ నీ మంగళవారం కొత్త బస్టాండ్ బాబు జగ్జీవన్ రావు విగ్రహం ముందు ఆవిష్కరించారు. జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నేత లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీసీల హక్కు 42 శాతం రిజర్వేషన్లు రిజర్వేషన్ల కై పోరాడి కొట్లాడు తెచ్చుకుందాం. బిసి రిజర్వేషన్స్ 50 శాతం సీలింగ్ వర్తించినపుడు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్స్ కూడా చెల్లవు రద్దు చేయండి. అదేవిధంగా ఈ డబ్ల్యూ ఎస్ 10 శాతం రిజర్వేషన్లలో ఓసి అయినటువంటి ముస్లింలు కూడా ఉన్నారు ఇది కూడా బిజెపి నాయకులు గమనించాలి బీసీ 42 శాతం రిజర్వేషన్లలో ముస్లిమ్స్ ఉన్నారని తెలంగాణ బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒకసారి ఆలోచించాలనీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్ అన్నారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్


పాల్గొన్న జిల్లా అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతి, సదా బైనామా, జనన- మరణ ధ్రువపత్రాలు, కుల- ఆదాయ నివాస ధ్రువపత్రాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఎలక్షన్ ఫారమ్ పెండెన్సీలు, ప్రజావాణి, సిఎం ప్రజావాణి, కాళేశ్వరం ప్రాజెక్ట్ 28వ ప్యాకేజీ, సదర్ మాట్ బ్యారేజ్ భూసేకరణ, ఇసుక అక్రమ రవాణా వంటి అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,

ప్రతి మండలంలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను వారానికొకసారి సమీక్షించి వేగంగా పరిష్కరించాలని, ప్రజలు సమర్పించిన దరఖాస్తులు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చూడాలని ఆదేశించారు. మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూభారతి వ్యవస్థలో సాంకేతిక సమస్యల వలన జాప్యం జరిగితే, తక్షణమే సాంకేతిక సహాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, సంబంధిత అర్జీదారులకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగంగా ఫైనల్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గ్రామస్థాయికి వెళ్లి దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ శాఖ ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే శాఖ. భూమికి సంబంధించిన సమస్యలను ప్రజల సంతృప్తి కలిగేలా పరిష్కరించడం ప్రతి అధికారికి బాధ్యతని కలెక్టర్ స్పష్టం చేశారు. పౌరసేవల జారీలో వేగం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువపత్రాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పైస్థాయికి పంపాలని ఆదేశించారు. పౌరసేవల గుర్తింపు పత్రాల జారీలో ఆలస్యం చేయరాదని, ప్రజలు దరఖాస్తు చేసిన వెంటనే పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భారీ వర్షాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక విపత్తు సహాయక కిట్లను కలెక్టర్ తహసీల్దార్లకు అందజేశారు. ఈ కిట్లలో అవసరమైన వస్తువులు, రక్షణ సామగ్రి, తక్షణ సహాయ సామగ్రి ఉన్నాయి. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు...


కార్యక్రమంలో మాట్లాడుతున్న ముధోల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

నిర్మల్ జిల్లా భైంసా అక్టోబర్ 14 అమృత్ తెలంగాణ భైంసా లోని గౌరీ శంకర్ ఫంక్షన్ హాల్ లో డీసీసీ నూతన అధ్యక్షుడి ఎన్నిక కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ కర్ణాటక ఎమ్మెల్యే డాక్టర్ అజయ్ సింగ్, కు బాణ సంచాలు పేల్చి ఆహ్వానించి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు మరియు ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావులి పటేల్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి గురించి మాట్లాడరు మరియు గత ప్రభుత్వం లో రైస్ మిల్లులో మరియు దళిత బస్తిలో అనేక రకాలుగా గత ప్రభుత్వం ప్రజలను దోచుకుంది నేను కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా బాధ్యతలు ఇచ్చినప్పటినుండి అవినీతికి పాల్పడిన రైస్ మిల్లర్ల నుండి దోచుకున్న సొమ్మును ప్రభుత్వానికి కట్టిస్తూ ఎంతో మంది జైలుకు వెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారం తో వారికీ శిక్ష పడే విధంగా చేయడం జరిగిందని రైస్ మిల్లర్లు దోచుకున్న డబ్బులను ప్రభుత్వానికి కట్టించే వరకు నిద్రపోనని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతిని చేసినట్టు ఈ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లలో చేస్తాను అంటే జైలు పాలు అవ్వడం ఖాయమని ఆ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి కాంగ్రెస్ పార్టీలో చేరిన అవినీతిపరులను సహించేది లేదని అన్నారు నేను ఏది ఉన్న కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అవినీతికి పాల్పడ్డ వారి పట్ల ఉన్నది ఉన్నట్లు ముక్కు సూటిగా నిజం చెప్పే దమ్మున్న వ్యక్తిని నేనే అని అన్నారు అజయ్ సింగ్, మీరు ఇక్కడ ఉన్నటువంటి పరిస్థితిని గమనించి అవినీతిపరులకు అవకాశం ఇవ్వకుండా ప్రజలలో ఉండే నాయకుడికి ప్రజలలో అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం ముందుకు తీసుకెళ్తూ మన కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు రాకుండా డీసీసీ ఎన్నిక విధానాన్ని జరపాలని మీ పైనే బాధ్యతను వదిలేస్తున్నానని తెలియపరిచరూ మరియు ఈ కార్యక్రమం లో నిర్మల్ జిల్లా ఇంచార్జి గా వచ్చినటువంటి రామ్ బోపాల్ మరియు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు,మాజీ కేంద్రమంత్రివర్యులు వేణుగోపాల చారి, మాజీ మంత్రివర్యులు ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, మాజీ చైర్మన్ లు మాజీ జడ్పీటీసీ లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు పద అధికారులు నాయకులు.

# విచ్చల విడిగా అక్రమ కట్టడాలు

**మెట్ పల్లిలో జోరుగా అక్రమ నిర్మాణాలు**
**ఇచ్చేది రెసిడెన్స్ పర్మిషన్.. కట్టేది మాత్రం కమర్షియల్**
**అక్రమ ఇంటి అనుమతుల్లో కాసుల కక్కుర్తిలో మున్సిపల్ అధికారులు**
**నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు**
**ఇంటి నిర్మాణాల్లో రూ. కోట్లలో మున్సిపల్ కు నష్టం**
**టౌన్ ప్లానింగ్ లో సిబ్బంది ఆడిందే ఆట**
**ఉన్నతాధికారులు పట్టించుకోవాలంటున్న పట్టణ ప్రజలు**






మెట్ పల్లి అమృత్ తెలంగాణ అక్టోబర్ 14: మెట్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేవారే లేకుండా పోయారు.ఏ వీధిలో చూసినా రోడ్లను కబ్జా చేస్తూ. పార్కింగ్‌కు సెల్లార్లను వదిలేయకుండా.. బాల్కనీలను పెంచి బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారు. అనుమతులు ఒకదానికి తీసుకుంటూ..నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నారు. ఇంతజరుగుతున్నా మెట్ పల్లి మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి మున్సిపల్ కమిషనర్లకు సూచించినా వారిలో కదలిక కనిపించడం లేదు.

**అడ్డూ అదుపూ లేకుండా అక్రమ కట్టడాలు**

మెట్ పల్లి మున్సిపల్ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో అక్రమ కట్టడాలు కొనసాగుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలను గుర్తించాల్సింది పోయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మెట్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీ ప్లస్ టూకే అనుమతి అని ప్రకటించినా అక్రమార్కులు 5 అంతస్థులు భవన నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు జీప్లస్‌టూకు అనుమతి తీసుకొని ఐదు అంతస్థుల భవనాలను, కొన్నింటికి అయితే ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారు.ఈ విధంగా తప్పుడు అనుమతులతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిద్ర మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకులోనై, మామూళ్లకు అలవాటు పడే అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు పార్కింగ్‌కు సెల్లార్స్ వదిలేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టి యథేచ్ఛగా అద్దెకు ఇచ్చుకుంటున్నారు.

**మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే..**

మెట్ పల్లి పట్టణంలో బహుళ అంతస్తు నిర్మాణాలకు నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్ ఉండాలి..కాంపౌండ్ కూడా కొంత స్థలం వదలాలి కానీ. అలాంటిదేమీ లేకుండా పలు చోట్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాదు.ఈ కట్టడాలకు పక్కనే ఉన్న డ్రైనేజీలు సైతం ఆక్రమించి మరీ నిర్మిస్తున్నారు. వెనకా ముందు ఏవైనా స్థలాలు ఉంటే ఆక్రమించుకుంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు,కింది స్థాయి సిబ్బంది వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది అండతోనే అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

**మున్సిపల్ అధికారులకు భారీగా ముడుపులు..**

పట్టణంలో ఇలాంటి బహుళ భవంతులు,అక్రమ కట్టడాల నిర్మాణంలో మున్సిపల్ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని అనుమతులు మంజూరు చేస్తుంటే. అధికార,ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు నాయకులకు కూడా ఇలాంటి దందాల్లో వేలు పెట్టి లక్షలు సంపాదిస్తున్నారు. నిర్మాణదారుల నుంచి భారీగా డబ్బులు తీసుకుంటూ దగ్గరుండి పనులకు ఎవరూ అడ్డురాకుండా చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.అందువల్లే అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు ఎవరూ స్పందించం లేదని తెలుస్తున్నది.ఒకవేళ స్పందించినా తూతూమంత్రంగా నోటీసులు పంపుతున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రణించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,


నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు చిత్రపటాన్ని బహుకరిస్తున్న నల్లోల్ల ప్లక్ష 10 వ తరగతి.

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి అక్టోబర్ 14 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఉదయం జడ్పీఎస్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి చదువుతున్న నల్లోల్ల ప్లక్ష అనే విద్యార్థిని తన చేతులతో గీసిన కలెక్టర్ చిత్రపటాన్ని బహుకరించింది. విద్యార్థిని ప్రతిభను కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఆమె సూచించారు. డిఈఓ, దర్శనం భోజన్న, ఎమ్మార్వో, శ్రీకాంత్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

# కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సుల్తాన్ చాంద్ ట్రస్ట్ పుస్తకాలు అందజేత


3.87 లక్షల విలువైన పుస్తకాలు అందజేసిన ట్రస్ట్

కోరుట్ల అమృత్ తెలంగాణ అక్టోబర్ 14 కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యూ ఢిల్లీకి చెందిన సుల్తాన్ చాంద్ ట్రస్ట్ వారు 3,87,494 రూపాయల విలువైన 954 పుస్తకాలను ఉచితంగా అందించారు. కామర్స్, బిజినెస్ మేనేజ్ మెంట్, కెమిస్ట్రీ, హిందీ, జియాలజీ, జియోగ్రఫీ, ఎన్విరాన్మెంటల్ వంటి ప్రధానాంశాలకు సంబంధించిన ఈ పుస్తకాలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అందించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపల్ నడి కట్ల సందీప్ విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ చైర్మన్ G.D. చౌదరి, ట్రస్టీ P.N. శ్రీకాంత్ లకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# గోదూరు అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం పై అవగాహన

**ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి**
**చక్కెర, ఉప్పు, నూనెలు తగ్గించాలి**
**సీజనల్ ఫ్రూట్స్ కూరగాయలు తప్పకుండా తినాలి**





ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ అక్టోబర్ 14 ఇబ్రహీంపట్నం మండలం గోదూరు రెండవ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి ఆధ్వర్యంలో పోషకాహారం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు బాలింతలుతల్లులు ప్రతి ఒక్కరు నిత్య ఆహారంలో ఉప్పు ,చక్కెర ,నూనెలను తగ్గించి వాడాలని సూచించారు ,ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని ఆరోగ్యాలు కాపాడుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి సౌమ్య అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ,ఆయాలు గర్భవతులు బాలింతలు తల్లులు పాల్గొన్నారు

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కట్టంగూర్ : అమృత్ తెలంగాణ: పౌష్టికాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి మూలమని, సమతుల ఆహారం ద్వారా సుస్థిర ఆరోగ్యం, సుభిక్ష జీవితం సాధ్యమని మండల విద్యాధికారి అంబటి అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, అశ్రిత స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'పోషణ అవగాహన – ఆరోగ్య పరీక్షలు – బాల్యవివాహాల నిర్మూలన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఐసిడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పౌష్టిక ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు.రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ వైద్యులు విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్లు శారద రాణి, పద్మావతి, అశ్రిత సంస్థ ప్రతినిధి ఝాన్సీ, డాక్టర్ కే. ప్రియాంక, డాక్టర్ ఎం. రామ్‌రెడ్డి, ఫార్మసిస్ట్ కే. విజయ్‌కుమార్, ఏఎన్‌ఎం ఉదయ, అంగన్‌వాడీ టీచర్లు జి. పద్మ, భిక్షమమ్మ, ఎన్. చంద్రకళ, ఎం. మంగమ్మ, ఆర్. లలిత కుమారి, కే. సైదమ్మ, సిహెచ్. శోభరాణి, బి. సంధ్య, సిహెచ్. వాణి, హసీనా ఉన్నారు. అనంతరం బాల్యవివాహాల నిరోధం, పౌష్టికాహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# ఎస్బిఐ ఖాతాదారిని భార్యకు పది లక్షల బీమా చెక్ అందజేత.



చెక్ అంద జేస్తున్న బ్యాంక్ మేనేజర్

మెట్ పల్లి అమృత్ తెలంగాణ అక్టోబర్ 14 జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారుడైన టీజీఎస్ఎన్పీడీసీఎల్ ఉద్యోగి రంగు రవీందర్ ఆరు నెలల క్రితం మరణించడంతో, ఆయన భార్యకు బ్యాంకు మేనేజర్ పి. నవీన్, కరెంట్ డిపార్ట్మెంట్ ఎస్సీడీఈఈ చేతుల మీదుగా రూ. 10 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఎస్బీఐ, టీజీఎస్ఎన్పీడీసీఎల్ మధ్య 2025 ఫిబ్రవరి 18న శాలరీ ప్యాకేజీ అకౌంట్ ఒప్పందం జరిగిందని బ్యాంకు మేనేజర్ తెలిపారు.

# ఘనంగా 69 వ దీక్ష దివస్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాస్ నగర్ బుద్ధవిహార్ లో 69 వ దీక్ష దివస్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ కొప్పుల రమేష్ మాట్లాడుతూ..“1956 అక్టోబర్ 14 – బౌద్ధ ధర్మ పునరుద్ధరణకు చారిత్రక మైలురాయి”. “నా జీవితంలో అక్టోబర్ 14 ముఖ్యమైన రోజు. నా జీవితంలో ఏది సాధించాలని తలచానో దాన్ని సాధించగలిగాను. ఇకనుండి ఉపోసత ఖచ్చితంగా పాటిస్తాను”.

అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు.

అక్టోబర్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బౌద్ధ భిక్షువు చంద్రమణి మహస్తవిర ఆధ్వర్యంలో భోధిసత్వ అంబేద్కర్ ఆయన భార్య సవితా కబీర్ లు,లక్షలాది తన అనుయాయులతో బౌద్ధ ధర్మం స్వీకరించారు. బోధిసత్వ అంబేద్కర్ సవిత కబీర్ లు బుద్ధ భగవాన్ ప్రతిమ ముందు మూడుసార్లు తలవంచి నమస్సులు తెలియజేశారు. మొదట తాను బుద్ధిష్టుగా మారిన తర్వాత తన అనుయాయులకు బౌద్ధ ధమ్మ దీక్ష ఇచ్చారు. పేదల నమ్మకాలు, ఆశలు, అవసరాల గురించి, భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచిస్తారు. కాబట్టి ధర్మం వీళ్ళకి చాలా అవసరం అని బోధిసత్వ అంబేద్కర్ నొక్కి చెప్పారు. అని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల



సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్

రమేష్ , మాల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు సింగరి అశోక్ , జిల్లా ముఖ్య సలహాదారు మేదరి స్వామి బౌద్ధ దమ్మ ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కుమార్ సత్యవాన్ చిక్టే , గణేష్ ,గులాబ్ , ఉపాసికులు,పెద్ద మొత్తంలో మహిళలు, బౌద్ధులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో గంజాయి పట్టివేత.

జగిత్యాల అమృత్ తెలంగాణ అక్టోబర్ 14 మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారులో మంగళవారం గంజాయి పట్టుకున్నట్లు మేడిపల్లి ఎస్సై ఎమ్. శ్రీధర్ రెడ్డి తెలిపారు. మేడిపల్లి పోలీసు వారికి మేడిపల్లి గ్రామ శివారులో బద్దం నాగరాజు తండ్రి: సాయి రెడ్డి, 26 సం:రాలు గుడేటి కాపు r/o తాంద్రియాల v/o కథలాపూర్ మండలం అనుమానంగా కనిపించగా అతన్ని తనిఖీ చేయగా అతని వద్ద 200 గ్రాముల గంజాయి దొరికినది. అట్టి వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు., గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందించాలని ఆయన కోరారు.గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా, సరఫరా చేసినా, వారికి సహకరించినా





చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. గంజాయి పట్టుకున్న మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డిని, కానిస్టేబుల్ నాగరాజుని సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్, మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు, కోరుట్ల సీఐ బి. సురేష్ బాబు అభినందించారు.

# అమరవీరుడు ఆర్ శంకర్ జ్ఞాపకార్థం బ్యారక్ ప్రారంభం.

**ఫ్లాగ్ డే వారోత్సవాలలో భాగంగా కార్యక్రమం నిర్వహణ.**
**కుటుంబ సభ్యుల సమక్షంలో విశ్రాంతి బ్యారక్ ప్రారంభం.**
**ఉట్నూర్ సబ్ డివిజనల్ అధికారులతో నేర సమీక్ష సమావేశం.**
**సబ్ డివిజనల్ పరిధిలో గంజాయి గుడుంబా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తిగా రూపుమాపాలని ఆదేశాలు.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : అక్టోబర్ 21 ఫ్లాగ్ డే వారోత్సవాల లో భాగంగా జిల్లా నందు సంఘవిద్రోహశక్తులతో పోరాడి అసువులు బాసిన అమరవీరుల జ్ఞాపకార్థం ఈరోజు ఉట్నూర్ నందు అమరవీరుడు ఆర్ శంకర పేరుపై బ్యారక్ ను ప్రారంభించడం జరిగింది. ఆర్ శంకర్ 1999వ సంవత్సరంలో బోథ్ నందు సంఘవిద్రోహశక్తులతో పోరాడి అసువులు బాసిన విషయాన్ని జ్ఞాపకం చేశారు. ఆర్ శంకర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఈరోజు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మరియు ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్ అధికారులు సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి బ్యారక్ ను ప్రారంభించడం జరిగింది. అదేవిధంగా ఉట్నూర్ సబ్ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ముఖ్యంగా మండలాలలో ప్రజలతో రైతులతో సత్సంబంధాలను మెరుగుపరుచుకోవాలని యువతకు ప్రజలకు ఆదివాసీలకు గాంజాయి మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాటి వల్ల కలుగు అనర్ధాలపై చైతన్య పరచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గుడుంబా పేకాట మట్కా లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బాధితులు సమర్పించడం ఫిర్యాదుల పట్ల తీసుకోవలసిన చర్యలపై సిబ్బంది చేసిన విధి విధానాలపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల వివరాలు వాటి స్థితిగతులు దర్యాప్తు పూర్తి చేసిన కేసుల వివరాలు ప్రతి ఒక్కదానిపై పరిశీలన చేసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలాలలో ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమార్కుల పాలు కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ వాహనాల ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా డయల్ 100 ద్వారా పెట్రో కార్ ద్వారా సాయంత్రం సమయాలలో గస్తీ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. బాధితుల ఫిర్యాదుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలపై సత్వరమే పరిష్కారం లభించే దిశగా కృషి చేయాలని సూచించారు.

# ఘనంగా అంబకంటి అశోక్ జన్మదిన వేడుకలు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గండ్రత్ సుజాత నివాసములో కాంగ్రెస్ పార్టీ నాయకులైన హౌసింగ్ బోర్డ్ 37 వ వార్డు ( తాజా మాజీ కౌన్సిలర్ ) ఓబీసీ జిల్లా అధ్యక్షులు అంబకంటి అశోక్ కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన టి పిసిసి,మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆశన్న , ఎ ఐ సి సి సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్,మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు సంజయ్ దూబే, గార్లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు




అంబకంటి అశోక్ కు కేక్ తినబడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?



బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైనసన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హెూస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ –3రని హెూస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. ‘తివారీ’ అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి –కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ‘ నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని’ రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె ‘అంతం’..’గాయం’..’అనగనగా ఒక రోజు’ లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న ‘బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్’

‘బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్’ సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. ‘బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్’ చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన



అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే ‘బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్’ సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ – మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఫైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి – వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com